క్లుప్తంగా

26న సామూహిక ఉచిత అక్షరాభ్యాసాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): 26వ తేదీ శ్రీపంచమిని పురస్కరించుకుని లంబాడీపేట గాంధీబొమ్మ సెంటర్‌లోని సాయిశ్రీ ఇంగ్లిష్ మీడియా స్కూల్‌లో ఉచిత సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. 26వ తేదీ ఉదయం 8.30 గంటలకు స్కూల్ ఆవరణలో నిర్వహించే కార్యక్రమంలో చిన్నారులకు అక్షరాభాస్యం చేయించే వారు ముందుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులందరికీ అక్షరాభ్యాసం చేయించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులకు స్కూల్ తరఫున ఉచితంగా పలక, బలపంతో పాటు పెన్సిల్ బాక్స్, ప్రసాదాలను అందజేయడం జరుగుతుందన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



సూర్యభగవానుడికి పూజలు చేస్తున్న అర్చకులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మాఘ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ఆదివారం సూర్యోపాసన సేవ జరిగింది. కళావేదికపై సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం సూర్యారాధన, సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరిగింది. లోక కళ్యాణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ సూర్యోపాసన సేవ నిర్వహించినట్లు ఆలయ అర్చకులు పేర్కొన్నారు. మాఘ మాసంలో వచ్చే ఏకాదశి, ఆదివారాలు, రథ సప్తమి, ఏకాదశి, పౌర్ణమి రోజులలో సేవ నిర్వహిస్తున్నామని ఆలయ అధికారులు పేర్కొన్నారు.

శాస్త్రోక్తంగా సూర్యారాధన

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో సూర్యారాధన కార్యక్రమం ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాఘమాసం, ఆదివారం కావడంతో ఆలయం ప్రాంగణంలో సూర్యుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘమాసం తొలిరోజే ఆదివారం కావడంతో భారీగా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి పర్యవేక్షించారు.

ప్రార్థనామందిరంలో..

పాతబస్తీలోని ప్రార్థనామందిరంలోని సూర్యభగవానుని మందిరంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

26న సూర్యనారాయణ స్వామి ఆలయ శంకుస్థాపన



కరపత్రం విడుదల చేస్తున్న మల్లికార్జునరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): గుంటూరు జిల్లా పెనుమాక గ్రామంలోని శ్రీవైష్ణవ మహా దివ్య క్షేత్రం రామానుజన్‌నగర్‌లోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న శ్రీసూర్యనారాయణ స్వామి దేవాలయానికి ఈ నెల 26వ తేదీ ఉదయం 9.45 గంటలకు శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైష్ణవ మహా దివ్య క్షేత్రం అధ్యక్షుడు చలవాది మల్లికార్జునరావు తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమ వివరాలతో కూడిన కరపత్రాన్ని ఆయన ఆదివారం విజయవాడలోని ఒక హోటల్లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ రథసప్తమి సందర్భంగా దేవాలయ మాడవీధుల్లో ఉదయం 5.30 గంటలకు వాహన సేవలు సూర్య ప్రభ వాహనంతో ప్రారంభమై రాత్రి ఎనిమిది గంటలకు చంద్రప్రభ వాహనంతో ముగుస్తాయని చెప్పారు. సమావేశంలో కమిటీ సెక్రటరీ దూబగుంట శ్రీనివాసరావు, కోశాధికారి ఆర్ ఉమామహేశ్వర గుప్తా, సభ్యులు వక్కలగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థను మెచ్చుకుంటున్న ప్రజలు

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



పథకాలు అందుకున్న లబ్ధిదారులతో వెలంపల్లి, కార్పొరేటర్ మాధురీ లావణ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలన్న ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థను ప్రజలు మెచ్చుకుంటున్నారని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం 45వ డివిజన్ 138వ వార్డ్ సచివాలయం పరిధిలో ఆయన స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురీ లావణ్యతో కలిసి గడప గడపకూ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతి ఇంట్లో ఆ కుటుంబానికి అందుతున్న పథకాల గురించి వివరిస్తూ వాటికి సంబంధించిన వివరాలతో కూడిన బ్రోచర్‌ను అందజేశారు. తమకు పథకాలు అందలేదని కొందరు అడగడంతో వారికి ఎందుకు రావడం లేదని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ప్రశ్నించారు. వారు చెప్పిన కారణాలను ఆలకించి సాంకేతిక సమస్యలతో పథకాలు అందనివారి వివరాలను తీసుకుని, వాటిని సరిచేసి తిరిగి దరఖాస్తు చేయించి అర్హత ఉంటే తప్పనిసరిగా పథకాలు అందేలా చూడాలని వారిని ఆదేశించారు.

ప్రజల మధ్యకు రా చంద్రబాబూ

ప్రజలకు మేలు చేయాలన్న సదుద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేస్తే వారిని మూటా కూలీలని, ఇళ్ల తలుపులు తట్టి మహిళలను ఇబ్బంది పెడుతున్నారని వ్యాఖ్యానించిన దుర్మార్గుడు చంద్రబాబు అని వెలంపల్లి అన్నారు. టీటీపీ ప్రభుత్వంలో అవ్వా తాతలు పింఛన్ తీసుకోవాలంటే కనీసం నాలుగైదు రోజుల పాటు క్యూలో నిలబడాల్సి వచ్చేదని గుర్తుచేశారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి నెలా ఫస్ట్ తారీకున వేకువజామునే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందిస్తున్నారని, ఆ సమయంలో వారి కళ్లల్లో కనబడే ఆనందం అంతాఇంతా కాదని అన్నారు. చంద్రబాబూ.. నీ ప్యాలెస్ నుంచి బయటకు వచ్చి వలంటీర్ వ్యవస్థ ఎలా పని చేస్తుందో ప్రజలను అడిగితే చెబుతారన్నారు. 138వ సచివాలయ పరిధిలో కొండ ప్రాంతం ఎక్కువగా ఉందని, మెట్లు, విద్యుత్ స్తంభాలు, డ్రైయినేజీ సమస్యల గురించి ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ప్రతి సచివాలయానికీ ప్రభుత్వం కేటాయించిన నిధులతో ఆయా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మైలవరపు కృష్ణ, బట్టిపాటి శివ, డి.హుస్సేన్, బి.మల్లేశ్వరరెడ్డి, కోటేశ్వరరావు, వెంకట్రావు, సుంకర నారాయణ, ముత్యాల రాంబాబు, పీతల నాగు, డీ రాము, నల్లం వాసు, గంగవరపు మురళి, గుండు శ్రీను, మైలవరపు దుర్గారావు, సచివాలయ కన్వీనర్లు ఎం పద్మ, లక్ష్మి, కోటేశ్వరి, సరగడ కృష్ణ, టీ ప్రసాద్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

అక్కినేనికి భారతరత్న పురస్కారం కోసం వినతి



అక్కినేని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జాతీయ స్థాయి ప్రతినిధులు

విజయవాడ కల్చరల్: సినీ నటుడు నిర్మాత అక్కినేని నాగేశ్వరరావుకు భారతరత్న పురస్కారం కోసం ఫౌండేషన్ ద్వారా కృషి చేస్తామని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించుకుంటున్నామని అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు చీదెళ్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకల నిర్వహణ సన్నాహక జాతీయ ప్రతినిధుల సమావేశం నిర్వహించింది. సభకు అధ్యక్షత వహించిన చీదెళ్ల మాట్లాడుతూ తెలుగు సినీ రంగచరిత్రలో అక్కినేని యుగం స్వర్ణయుగమని భారతదేశ కీర్తి ప్రతిష్టలు చాటిచెప్పేలా ఆయన అనేక విజయవంతమైన చిత్రాలు నిర్మించారన్నారు. ఫౌండేషన్ ద్వారా భావితరాలకు కూడా గుర్తుండిపోయేలా కార్యక్రమాలను చేస్తామన్నారు. కళాకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ప్రపంచం గర్వించేలా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని స్వరాజ్యమైదానంలో నిర్మించి చరిత్రకు కొత్త అర్థం చెప్పిందన్నారు. ఎన్టీఆర్ పేరుతో జిల్లాను ఏర్పాటు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైందన్నారు. అక్కినేని కోసం ప్రభుత్వం సానుకూలంగా నిర్ణయం తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సినీ క్రిటిక్ సంజయ్ కిషోర్ మాట్లాడుతూ అక్కినేని లేని తెలుగు సినీ చరిత్రను ఊహించలేమన్నారు. తెలుగు సినిమారంగాన్ని మద్రాస్‌నుంచి హైదరాబాద్ తీసుకురావడానికి ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. తొలుత అక్కినేని చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. వివిధ ప్రాంతాల ప్రతినిధులు కేవీఎస్ సత్యనారాయణ, ఓం నమశ్శివాయ, ఆదినారాయణ, నవీన్ ప్రసాద్, ఇబ్రహీం ఖాన్, సూరిబాబు, విజయరాజ్, పొన్నాడ మోహన్ రావు, మణిబాబు పాల్గొన్నారు.

రాజాశ్యామలా దేవి నవరాత్రులు ప్రారంభం



చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని లలితాంబికా పీఠంలో ఆదివారం నుంచి శ్యామలాదేవి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. నవ రాత్రులలో తొలి రోజున ఆదివారం లలితాంబికా అమ్మవారికి పీఠాధీశ్వరి శివలీల మాతాశ్రీ విశేష అభిషేకాలు నిర్వహించారు. తొలుత గణపతి పూజతో ఉత్సవాలను ప్రారంభించారు. అభిషేకాల అనంతరం అమ్మవారికి విశేష అలంకారం, కుంకుమార్చన జరిపించగా, పెద్ద ఎత్తున ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి విశేష అలంకరణతో పాటు శ్రీచక్ర అభిషేకాలు, కుంకుమార్చన నిర్వహించనున్నట్లు పీఠం కన్వీనర్ చైతన్య పేర్కొన్నారు.

వైభవంగా రాజేంద్ర సూరీశ్వర్‌జీ ప్రతిమ శోభాయాత్ర



రాజేంద్ర సూరీశ్వర్‌జీ ప్రతిమను తీసుకెళుతున్న జైనులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): జైనుల గురువు రాజేంద్ర సూరీశ్వర్‌జీ ప్రతిమ శోభాయాత్ర వైభవంగా జరిగింది. రాజేంద్ర సూరీశ్వర్‌జీ జైన్ గురుమందిర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని జైన్ మందిరంలో ప్రతిష్ట మహోత్సవంలో భాగంగా ఆదివారం ఆయన ప్రతిమను తుమ్మలపల్లి కళాక్షేత్రం వద నుంచి శోభాయాత్రగా బయలుదేరారు. పోలీస్ కంట్రోల్ రూమ్, పాత బస్టాండ్, బందరు రోడ్ మీదుగా రాఘవయ్య పార్క్ సమీపంలోగల జైన్ మందిరానికి తీసుకెళ్లారు. జైనులు సంప్రదాయ ఆచార వ్యవహారాలతో శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు భవర్‌లాల్ జైన్ మాట్లాడుతూ జైనులకు విశేష మార్గదర్శకం చేసి జైన మత పటిష్టత, సామాజిక వికాసానికి పాటుపడిన జైన గురువు రాజేంద్ర సూరీశ్వర్‌జీ విగ్రహాన్ని గవర్నర్‌పేటలోని జైన మందిరంలో ప్రతిష్టించేందుకు నిర్ణయించామని తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం నుంచి 29వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నామని చెప్పారు. జైన గురువుడాక్టర్ వైభవ్‌రత్న విజయజీ ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రముఖులు చంపాలాల్ జైన్, దినేష్‌కుమార్ జైన్, మనోహర్‌మల్ జైన్, దినేష్ జైన్, కిషోర్‌కుమార్ జైన్, గిషాలాల్ జైన్, తేజరాజ్ సోలంకి, పారస్‌మల్ జైన్, పుఖరాజ్ జైన్, సూరజ్ మల్ జైన్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దు

ఎస్ఈబీ ప్రభాకరరావు



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రభాకరరావు, సీఐ శ్రీనివాస్

భవానీపురం(విజయవాడపశ్చిమ): మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు అలవాటుపడి, నిండు జీవితాన్ని పాడు చేసుకోవద్దని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సూపరింటెండెంట్ టీ ప్రభాకరరావు పేర్కొన్నారు. డీసీపీ మోకా సత్తిబాబు ఆదేశాల మేరకు గొల్లపూడిలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో ఆరోగ్యంపై చూపించే దుష్ప్రభావాలపై విద్యార్థులతోపాటు యువత కలిసి విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసలై మీతోపాటు మీ కుటుంబానికి సమాజంలో తలవంపులు తీసుకురావద్దని హెచ్చరించారు. భవానీపురం స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి శ్రీనివాస్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల అమ్మకాలు, వినియోగం, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్), సారాకు సంబంధించిన సమాచారం తెలిస్తే ఎస్ఈబీ టోల్‌ఫ్రీ నంబర్14500 ద్వారా తెలియజేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డ్రగ్స్ వినియోగం, అక్రమ మద్యం రవాణా సమాజంలో అతి పెద్ద సమస్యగా మారిందన్నారు. వాటిని అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా గంజాయికి అలవాటు పడిన కళాశాలల విద్యార్థులను ఒక కంట కనిపెట్టి తల్లిదండ్రులను అప్రమత్తం చేసేలా చర్యలు చేపట్టాలని కళాశాల యాజమాన్యానికి సూచించారు.

'జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం'

భవానీపురం(విజయవాడపశ్చిమ): బీసీ కార్పొరేషన్ల పదవీ కాలాన్ని కొనసాగిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఏపీ విశ్వబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండేళ్ల పదవీ కాలం ముగిసినా మరోమారు అవకాశం కల్పించిన సీఎం జగనన్నకు అన్ని కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్లు అందరూ జీవితాంతం రుణపడి ఉంటారని తెలిపారు. వెనుకబడిన తరగతులలో ఎన్ని కులాలు, ఉపకులాలు ఉన్నాయో ఎవరికీ తెలియని పరిస్థితుల్లో ముఖ్యమంత్రి వైఎ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత 139 కులాలను గుర్తించి 56 సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్లను ఏర్పాటు చేసిన ఘనత దేశంలో మరే ముఖ్యమంత్రికి దక్కలేదని తెలిపారు. సీఎం జగనన్న బీసీలకు అన్నింటా పెద్ద పీట వేస్తున్నారని, వారంతా ఆయన వెంటే ఉంటూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిని చేసి తీరతారని పేర్కొన్నారు. చట్ట సభల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 70 శాతం మందికి అవకాశం కల్పించి రాజ్యాధికారంలో భాగస్వాములను చేసిన సీఎం జగన్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారని పేర్కొన్నారు.

ప్రశాంతంగా పోలీస్ నియామక రాత పరీక్ష













నగరంలో ఆదివారం నిర్వహించిన పోలీస్ నియామక రాతపరీక్ష ప్రశాంతంగా జరిగింది. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కాకరపర్తి భావనారాయణ తదితర కళాశాలలో పరీక్ష కేంద్రాలను కేటాయించారు. పోలీసులు తొలుత తనిఖీలను నిర్వహించి అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పరీక్ష కొనసాగింది. పరీక్ష కేంద్రాల వద్దకు అభ్యర్థులతో పాటుగా వారి తల్లిదండ్రులు కూడా రావటంతో ఆయా ప్రాంతాలు రద్దీగా మారాయి. కేబీఎన్ కళాశాలలో వెయ్యి మంది అభ్యర్థులకు గాను 877 మంది హాజరయ్యారు.

- వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)

శ్రావ్యంగా సాగిన స్వరలయ సౌరభం



వాగ్గేయకార కృతులను గానం చేస్తున్న భాను

విజయవాడ కల్చరల్: శ్రీ సుబ్రహ్మమణ్య సంగీత సమితి ఆధ్వర్యంలో దుర్గాపురంలోని శివరామకృష్ణ క్షేత్రంలో ఆదివారం యువ, చిన్నారి సంగీత కళాకారులు నిర్వహించిన స్వరలయ సౌరభం శాస్త్రీయ సంగీత వైభవాన్ని చాటింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు వాగ్గేయకార కృతులను ఆలపించారు. జూనియర్ విభాగంలో వీ భాను, మంగళగిరి శ్రీవ్యాస్, కే శ్రావ్య శ్రీవాణి, కే మహిత్ గాత్ర సంగీతంతోనూ, ఎ.శృతి, వీ సాత్విక వీణతోనూ శ్యామ కృష్ణ మృదంగంతోనూ అలరించారు. సీనియర్ విభాగంలో నిమ్మగడ్డ నయన, డీ. మహలక్ష్మి, టీ నాగ ఫణికృష్ణ, టీ పవిత్ర, సీనియర్ విభాగంలో అయ్యప్పన్ ప్రణతి, మనసిజ, పీవీఎల్ మహతి త్యాగరాజ కృతులను ఆలపించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సంగీత విద్వాంసుడు పీ గౌరీనాథ్ మాట్లాడుతూ బాల బాలికలలోని ప్రతిభను గుర్తించి, ప్రోత్సహిస్తున్న సంగీత సమితి సేవలను అభినందించారు. చదువులపట్ల ఆసక్తితోపాటు లలిత కళలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందన్నారు. సంగీత సమితి కార్యదర్శి సీవీ రావ్ మాట్లాడుతూ ప్రతి ఏటా సంగీతంలోని వివిధ అంశాలలో పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానోత్సవంతోపాటు వారికి వేదికమీద అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యావేత్త ఎంసీ దాస్ చేతులమీదుగా బహుమతులను అందజేశారు.

నేడు 'స్పందన'

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని 64 డివిజన్లలో సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు, అర్జీలు స్వీకరించేందుకు స్పందన కార్యక్రమానికి సోమవారం నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే స్పందనలో నగరవాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికితీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతోపాటు చిట్టినగర్‌లోని సర్కిల్-1, సత్యనారాయణపురంలోని సర్కిల్-2, పటమటలోని సర్కిల్-3 కార్యాలయంలో కూడా తమ సమస్యలను జోనల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లవచ్చని తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో శాంతిస్థాపన



మాట్లాడుతున్న రామమూర్తి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజంలో ఆధ్యాత్మిక చింతనతోనే శాంతి వర్ధిల్లుతుందని రిటైర్డ్ ప్రిన్సిపాల్, ప్రవచనకర్త కంభంపాటి రామమూర్తి అన్నారు. పాతబస్తీలోని శాంతి సత్సంగ మండలి వార్షికోత్సవ వేడుకలను పాతబస్తీలోని రాయల్ బంక్వెట్ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన రామమూర్తి మాట్లాడుతూ ఆధ్యాత్మిక భవనతో ప్రజలు ముందుకు సాగాలన్నారు. భగవంతుని కృప ఉంటే మానవులు సాధించలేనిది లేదన్నారు. భారతీయ సనాతన ధర్మాన్ని అందరూ అనుసరించాలన్నారు. రానున్న తరాలకు వారసత్వంగా వస్తున్న భారతీయ సంప్రదాయాలను అందించాలన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు మాట్లాడుతూ శాంతి సత్సంగ మండలి సేవలను కొనియాడారు. ప్రముఖ న్యాయవాది నరహరిశెట్టి శ్రీహరి మాట్లాడుతూ విజయవాడ పాతబస్తీలో శాంతి సత్సంగ మండలి అద్భుతమైన పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కూరపాటి సత్యనారాయణ, కన్వీనర్ జమిలి పురుషోత్తమరావు, ప్రధాన కార్యదర్శి వెజ్జు సాంబశివరావు, కోశాధికారి రాచపూడి శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.